క్లుప్తంగా

దివ్యాంగుల హక్కుల సాధనకు పోరాటం



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఉరవకొండ: స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీ కరిబవేశ్వర విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య అధ్యక్షుడు యం.రాము తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. డిసెంబర్ 3న జరిగే ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీతో పాటు ఆర్డీటీ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించిన దృశ్యం

కూడేరు: అరవకూరులోని ఊరుగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఘనంగా సాగింది. తొలుత ఆంజనేయ స్వామికి ప్రతేక పూజలు నిర్వహించారు. భక్తుల ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. అనంతరం అన్నదానం చేశారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం

ఉరవకొండ: కంది పంటకు సోకే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బూదగవి వద్ద సాగు చేసిన కంది పంటను రైతులతో కలిసి పరిశీలించారు.

ఉమ్రాకు బయల్దేరిన యాత్రికులు



రాయదుర్గంటౌన్: పట్టణం నుంచి 120 మంది యాత్రికులు ఉమ్రయాత్ర (మక్కా, మదీన) బయల్దేరి వెళ్లారు. బెంగళూరుకు చెందిన అల్ అమన్ గ్రూప్ ద్వారా రాయదుర్గానికి చెందిన వీరంతా బుధవారం రాత్రికి బెంగళూరుకు చేరుకుని గురువారం ఉదయం ఎయిపోర్ట్ నుంచి సౌదీలోని జిద్దాకు చేరుకుంటారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

బొమ్మనహాళ్: ప్రజలందరినీ చైతన్యవంతుల్ని చేసి ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రీడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్ హైస్కూల్‌లో 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రవి, రీడ్స్ సిబ్బంది సావిత్రి, గంగమ్మ, ఎర్రిస్వామి, వరలక్ష్మీ పాల్గొన్నారు.

హిటాచీ సీజ్

రాయదుర్గం: ఇసుక అక్రమ రవాణాపై మైన్స్ అండ్‌జియాలజీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపారు. బుధవారం రాయదుర్గం మండలం వేపరాళ్ల సమీపాన వేదావతి హగరిలో ఇసుక తవ్వకాలు చేపట్టిన హిటాచీని సీజ్‌చేశారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

సీలు లేని వేయింగ్ మిషన్లు వినియోగిస్తే చర్యలు



గుర్రప్ప ఫర్టిలైజర్ షాపులో వేయింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న అధికారి శంకర్

కణేకల్లు: సీలు లేని వేయింగ్ మిషన్లు వినియోగించి ప్రజలను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని తూనికల, కొలతలశాఖ అధికారి శంకర్ వ్యాపారులకు హెచ్చరించారు. కణేకల్లులో బుధవారం ఆయన ఫర్టిలైజర్‌షాపు, చికెన్ సెంటర్లతోపాటు వివిధ షాపులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లను పరిశీలించారు. అనేక మంది వ్యాపారులు సీలు లేని వేయింగ్ మిషన్లు వినియోగిస్తూ తూకాలు వేసి ప్రజలకు సరుకులు, చికెన్‌లు విక్రయిస్తుండటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలు దుకాణాలకు చెందిన యజమానులకు జరిమానా విధించారు.

ఖాకీల కక్కుర్తి..!




- కంబదూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొందరు కానిస్టేబుళ్లు కర్ణాటక సరిహద్దులోని కురాకులపల్లి, సరిహద్దు ప్రాంతంలో పేకాటను ప్రోత్సహిస్తున్నారు. ఎస్ఐ లేకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆటగా అక్రమాలకు తెరలేపారు. మామూళ్లు తీసుకుంటూ స్వయంగా పోలీసులే పేకాట ఆడిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి.
- బ్రహ్మసముద్రం పోలీస్‌స్టేషన్లో కొందరు సిబ్బంది పేకాటను ప్రోత్సహిస్తున్నారు. ఏకంగా పేకాటరాయుళ్లకు అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి మరీ ఆడిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కర్ణాటక సరిహద్దు మండలం కావడంతో కర్ణాటక మద్యం సైతం స్వయంగా డబ్బు ఇచ్చి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పోలీసు శాఖలో కొందరు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. కళ్యాణదుర్గం పోలీస్ సబ్ డివిజన్ పరిధితో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో పేకాట రాయుళ్లు, మట్కా నిర్వాహకులతో దోస్తీ కడుతూ అప్పణంగా దోచేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా ఇదే తంతు జరుగుతోంది. ఇటీవల ఎస్పీ జగదీష్ తమదైన శైలిలో పోలీసు శాఖలోని అక్రమార్కులపై ఉక్కుపాదం మోపడంతో పలువురి బాగోతం బయటకు వచ్చింది.

- అదనపు ఆదాయం కోసం అడ్డదారులు
- పేకాట, మట్కారాయుళ్లకు సహకారం
- సోదాల సమాచారం చేరవేస్తూ వసూళ్లు
- కళ్యాణదుర్గం డివిజన్‌లో పలువురి లీలలు వెలుగులోకి

కళ్యాణదుర్గం: శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో కీలకపాత్ర పోషించాల్సిన పోలీసుల్లో కొందరు దారి తప్పుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో విధులు నిర్వర్తించే విలేజ్ కానిస్టేబుళ్లు అదనపు సంపాదన కోసం ఆయా గ్రామాల్లో పేకాట, మట్కా రాయుళ్లతో జతకడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలోని గ్రామాలను ఇందుకు ఎంపిక చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉదయం నుంచే కానిస్టేబుళ్లు ఎంచుకున్న గ్రామాలకు వెళ్లి దందా కొనసాగిస్తున్నారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. పైస్థాయి అధికారుల పేర్లు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. పలు మండాలల్లో ఆదివారం వచ్చిదంటే చాలు ఏకంగా మటన్, చికెన్ లాంటి విందులను సైతం పేకాటరాయుళ్ల నుంచే ఏర్పాటు చేసుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు.

లీకులు ఇచ్చి.. కాసులు పోగేసి..



నియోజకవర్గంలో ఏ మారుమూల పేకాట స్థావరాలపై దాడులకు వెళ్లినా ఆయా గ్రామాల కానిస్టేబుళ్లు నియమించుకున్న పోలీస్ ఇన్ఫార్మర్లకు సమాచారం ఇచ్చి పేకాటరాయుళ్లు దొరకకుండా చూస్తున్నారు. ఈ క్రమంలోనే కుందుర్పి మండలం కొలిమిపాళ్యం గ్రామంలో కానిస్టేబుళ్లు పేకాటస్థావరంపై దాడులు నిర్వహించేందుకు వస్తున్నారనే సమాచారం ఇచ్చి వారి వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ దుస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు వీఆర్‌కు



విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటూ పేకాట, మట్కా రాయుళ్లతో దోస్తీ కడుతున్న పోలీసులపై ఎస్పీ జగదీష్ కొరడా ఝుళిపిస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో ప్రైవేట్ పంచాయితీలు చేస్తూ సెటిల్‌మెంట్ చేసేవారిని వదిలేది లేదంటూ ఎస్పీ తనదైన శైలిలో హెచ్చరించారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా కళ్యాణదుర్గం అర్బన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ రాజశేఖర్, కుందుర్పి పోలీసు స్టేషన్లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న మజ్బూల్ రెహ్మాన్, సురేష్‌బాబును వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులిచ్చారు.

రైతు, కార్మిక సమస్యలపై 26న ధర్నా



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కళ్యాణదుర్గం: రైతులు, కార్మికుల సమస్యలపై ఈ నెల 26న కలెక్టరేట్, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపు యాత్ర బుధవారం పట్టణంలోని జగ్జీవన్‌రామ్ సర్కిల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ నల్ల చట్టాల రద్దు సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కణేకల్లు: రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న అనంతపురం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించ తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు విజ్ఞప్తి చేశారు. కణేకల్లులో బుధవారం సీఐటీయూ జీపు జాత జరిగింది. ఓబుళు మాట్లాడుతూ రైతాంగ సమస్యలతో పాటు అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, పారిశుధ్య కార్మికులతో పాటు కాంట్రాక్ట్ బేసిక్‌పై పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నాగేంద్ర, నాగరాజు, శర్మాస్ తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు'



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సిబ్బందికి హెచ్చరించారు. బుధవారం కూడేరులోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలు, అరవకూరులోని మినీ, మెయిన్, బ్రాహ్మణపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పని వేళల్లో తప్పకుండా కేంద్రాల్లోనే ఉండాలని ఆదేశించారు. కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

గుమ్మఘట్ట: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలోని గోనబావి, తాళ్లకెర గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళకు గాయాలు

రాయదుర్గం టౌన్: వంట గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగడంతో రాయదుర్గంలోని ఓబుళాచారి రోడ్డు పోస్టాఫీసు వెనుక నివాసముంటున్న వీణ తీవ్రంగా గాయపడింది. బుధవారం మధ్యాహ్నం ఆమె ఒక్కతే వంట చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. గమనించిన బంధువులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. తీవ్రంగా గాయపడిన వీణను స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, అనంతపురానికి తరలించారు. కాగా, వీణ భర్త గతంలోనే మృతి చెందడంతో ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడితో కలిసి గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికురాలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శ్రీనివాసరావు



నూతన డీఎం శ్రీనివాసరావుకు స్వాగతం పలుకుతున్న యూనియన్ నాయకులు, సిబ్బంది

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఏపీఎస్‌ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా జె.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు, సిబ్బంది ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అలాగే బదిలీపై వెళ్లిన మేనేజర్ సురేష్‌ను సత్కరించారు.

కార్యకర్తలను కాపాడుకుందాం



సజ్జల రామకృష్ణారెడ్డితో మెట్టు విశ్వనాథరెడ్డి

రాయదుర్గం: కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా అన్ని విధాల కాపాడుకునే బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని, ఆ దిశగా క్షేత్రస్థాయిలో నాయకత్వం బలంగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డికి దిశానిర్దేశం చేశారు. బుధవారం తాడేపల్లి లోని సజ్జలను విశ్వనాథరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కంబదూరు: మండలంలోని ఓబిగానిపల్లి చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 90 ఎంఎల్ సామర్థ్యమున్న 864 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వీటిని అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐలు అన్నపూర్ణ, సునీల్‌కుమార్, ఎస్ఐ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి ఉత్సవాలు

విడపనకల్లు: మండల పరిధిలోని హావళిగి గ్రామంలో బుధవారం గౌరీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కడ్లే గౌరీదేవికి ఆడపడుచులు చెక్కెర హారతులు సమర్పించారు. అంతకుముందు గౌరీ దేవి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో హోమం చేపట్టారు. కడ్లే గౌరీ దేవి ప్రతిమను గురువారం నిమజ్జనం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సర్వేలు వంద శాతం పూర్తి కావాలి



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లలితా బాయి

కూడేరు: నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ), హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వేలు మండలంలో వంద శాతం పూర్తి కావాలని డీఎల్‌డీఓ లలితా బాబు ఆదేశించారు. బుధవారం డీఎల్‌డీఓ కూడేరులోని సచివాలయం-1, 2లను తనిఖీ చేశారు. సర్వేలకు సంబంధించి ఎంత శాతం పూర్తి చేశారని , ఎంపీడీఓ కుల్లాయి స్వామి , సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేలపై ఎవరూ అలసత్వం వహించొద్దన్నారు.

పాత్రికేయులకు సన్మానం

రాయదుర్గంటౌన్: జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ సిటిజన్స్ రాయదుర్గంశాఖ ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులను సన్మానించారు. బుధవారం స్థానిక ఏపీ ఎన్జీఓ భవన్‌లో లయన్స్ క్లబ్ రాయదుర్గంశాఖ అధ్యక్షుడు వాడేకర్ అంబోజీరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమం జరిగింది. సీనియర్ పాత్రికేయులు గుడేకోట శివకుమార్, మనోహర్ తదితరులు మాట్లాడుతూ పాత్రికేయులను సత్కరించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



శర్మస్ హుసేన్సీస్వామి సమాధి

బొమ్మనహాళ్: ప్రముఖ దర్గాహొన్నూరు శర్మస్ హుసేన్సీస్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో దీపారాధనోత్సవం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి దర్గా చుట్టూ దీపాలు వెలిగించడంతో దీపకాంతులతో దర్గా వెలిగిపోయింది. అనేక మంది స్వామిని దర్శించుకుని పూలమాలలు సమర్పించి, చక్కెర చదివింపులు చేశారు. దర్గా నిర్వాహకులు, ముతవల్లి రహమతుల్లా భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ఉరుసే షరీఫ్ దేవుడి సవారి జరగనుంది.

గొర్రెల కాపరిని చితకబాదిన ఎస్ఐ

డి హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మంగలి సర్వేశ్‌పై ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి అకారణంగా దాడి చేసి చితకబాదారు. బాధితుడు తెలిపిన మేరకు... గ్రామంలోని ఓ వర్గం వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తానే చించినట్టు బుధవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వాతలు పడేలా కొట్టారని వాపోయాడు. దీంతో ఆస్పత్రిలో చికిత్స కోసం చేరినట్లు వివరించాడు. ఎస్ఐ దౌర్జన్యం నుంచి తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశాడు.

ఐక్యంగా ఉద్యమిద్దాం

రాయదుర్గంటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌లు, డివిజన్ కార్యాలయాల ముందు చేపట్టిన మహాధర్నా, నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాత బుధవారం రాయదుర్గం పట్టణానికి విచ్చేసింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కనీస వేతనం అమలు చేయాలి

రాయదుర్గంటౌన్: పురపాలకసంఘంలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీఓ నెంబర్ 36 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిప్పేరుద్ర, మైలారస్వామి, శ్రీనివాసులు, రాము, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

శెట్టూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంఈఓ శ్రీధర్ బుధవారం పరిశీలించారు. అపార్ నమోదు ప్రక్రియలో భాగంగా ఆధార్‌లో తప్పులు సరిదిద్దుకునేందు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ఈ నెల 23 వరకు కొనసాగిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

నాణ్యతలేని మాంసం విక్రయిస్తే చర్యలు

కణేకల్లు: నాణ్యత లేని మాంసం విక్రయిస్తే చర్యలు తప్పవని కణేకల్లు మేజర్ గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ప్రసాద్ మాంసం విక్రయదారులకు హెచ్చరించారు. మాంసం విక్రయదారులు రోగాల బారిన పడిన గొర్రెలు, మేకలను కోసి విక్రయిస్తున్నారని, మాంసం నాణ్యత లేనికారణంగా తమ ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని పలువురు పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ ప్రసాద్ స్థానిక కార్యాలయంలో బుధవారం మాంసం విక్రయదారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఘనంగా కడ్లే గౌరీదేవి ఊరేగింపు

బొమ్మనహాళ్: కడ్లే గౌరీదేవి ఉత్సవాలు ఘనంగా బుధవారం ముగిశాయి. మండలంలోని గోవిందవాడ, కల్‌హోళ, బొల్లనగుడ్డం గ్రామాల్లోని వివిధ అమ్మవారి ఆలయాల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకొన్న కడ్లే గౌరీదేవిని భక్తులకు ఘనంగా ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున నుంచి అందంగా అలంకరించిన ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ వాహనాల్లో అమ్మవారిని ఊరేగించారు. అనంతరం కడ్లే గౌరీదేవి జలాభిషేకం నిర్వహించారు.

రాష్ట్రంలో మహిళల రక్షణ శూన్యం

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో మహిళల రక్షణ శూన్యమని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ చందన శివాజీ అన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత మహిళల దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు, హత్యలు పెరిగిపోవడంపై బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ముచ్చుమర్రిలో బాలికను హత్య చేసిన ఘటనలో ఎలాంటి పురోగతీ లేదన్నారు. ఇందులో ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో దిశ యాప్ ఉన్నప్పుడు మహిళలు ఎంతో ధైర్యంగా ఉండేవాళ్లని గుర్తు చేశారు. గతంలో ఆపదలో ఉన్న మహిళలు ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే పోలీసులు వచ్చి రక్షించే అవకాశం ఉండేదన్నారు. మహిళల రక్షణ కోసం దిశ యాప్, దిశ స్టేషన్‌ను కొనసాగించాలని లేదా సమాంతర వ్యవస్థనైనా తీసుకురావాలని సూచించారు. మహిళలపై దాడులు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, హోం మినిస్టర్ పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వజ్రకరూరు: మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ నాగస్వామి సూచించారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని బీసీ బాలుర ప్రభుత్వ వసతి గృహంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ.. సమయాన్ని వృథా చేసుకోకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యాయులు మహబూబ్ బాషా, క్రాంతి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దకొట్టాలపల్లిలో 'పొలం పిలుస్తోంది'

విడపనకల్లు: మండల పరిధిలోని పెద్దకొట్టాలపల్లిలో బుధవారం మండల వ్యవసాయశాఖ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలసి సాగు చేసిన పప్పుశనగ పంటను పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, వీఏఏ పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట

బెళుగుప్ప: మండల పరిధిలోని కాలువపల్లిలో బుధవారం పెద్దమ్మ దేవత విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. వేదపండితుడు బెల్డోణ రామనాథశాస్త్రి ఆధ్వర్యంలో చండీ హోమం, బలి, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, పెద్దమ్మ దేవతను దర్శించుకున్నారు. దాతల సహాయంతో మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ సేవా కమిటీ సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులపై మండలస్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు వివరించాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం సీజనల్ వ్యాధులకు సంభందించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోనాలిసా, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి, వైద్యాధికారులు తేజశ్వి, సర్దార్‌వలి, ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసాద్, గ్రామ కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు.

కనకదాస చిత్రపటం ఊరేగింపు

విడపనకల్లు: మండల పరిధిలోని హావళిగి గ్రామంలో బుధవారం కనకదాస జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి వీధుల్లో ఊరేగించారు. అనంతరం కడ్లేగౌరమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు బ్యాళ్ల తుప్పటి ఈశ్వరయ్య, సర్పంచు దేవారాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కురుబ రమేష్, ఎంపీటీసీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ పరిశీలన

కణేకల్లు: మండలంలోని రచ్చుమర్రి ఇసుక రీచ్‌ను జేసీ శివనారాయణశర్మ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఇసుక రీచ్‌లో ఏమైనా ఇబ్బందులున్నాయా? అని ట్రాక్టర్ యజమానులను జేసీ అడిగారు. గతంలో ఇసుక రీచ్ నిర్వహణ కోసం టెండర్లు పిలిచామని, అయితే ఎవరూ ముందుకు రాలేదని జేసీ తెలిపారు. మరోమారు టెండర్‌కు ఆహ్వానించామని ఎవరైనా ముందుకొస్తే వారికి అప్పగిస్తామన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ఉరవకొండ: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ, లైబ్రేరియన్లు

సాక్షిబృందం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. బుధవారం ఆయా శాఖా గ్రంథాయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిరు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులను ప్రదానం చేశారు. వక్తలు గ్రంథాలయాల ఉపయోగాలను వివరించారు.